అర్ధరాత్రి సంచరిస్తే చర్యలు తప్పవు



కౌన్సెలింగ్ ఇస్తున్న వనస్థలిపురం పోలీసులు

హస్తినాపురం: నేర నివారణ చర్యలో భాగంగా వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి దాటిన సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను సేకరించారు. సుమారు 40 మందిని వారి తల్లిదండ్రుల సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై అర్ధరాత్రి తిరగకుండా ఉండాలని మళ్లీ పోలీసులకు పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఐ రాజేష్, అడ్మిన్ ఎస్సై గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

చంపాపేట: చంపాపేట చౌరస్తాలోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాల వార్షికోత్సవాలకు డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈలయ అర్చకులు మధుసూధన్‌రెడ్డిని వేద మంత్రాలతో ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

వనస్థలిపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్ వైదేహినగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నెలలో మూడు రక్తదాన శిబిరాలు నిర్వహించిన శంకర్‌ను అభినందించారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి మాట్లాడుతూ.. అన్ని దానాల కన్న రక్తదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో డా. కోటేశ్వర్‌రావు, కాలనీవాసులు రాంచందర్‌గౌడ్, సునీత, బాలరాజు, నాగేశ్వర్‌రావు, శ్యామ్‌గౌడ్, రాజు, శ్రీనివాసచారి, విజయ్ పాల్గొన్నారు.

అవేర్ సంస్థ సేవలు అమోఘం

లింగోజిగూడ: గత 50 ఏళ్లుగా అవేర్ సంస్థ చేపడుతున్న సేవలు అమోఘమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బైరామల్‌గూడలోని అవేర్ నర్సింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్‌లో కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఆమె పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అవేర సంస్థ ఇప్పటి వరకు వివిధ సేవల్లో 41 అవార్డులు అందుకుందన్నారు. నర్సుగా విధులు నిర్వహించాలంటే ఎంతో ఓపిక అవసరమని, రోగులకు నవ్వుతూ సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. కశ్మీర్ ఉగ్రదాడిలో పర్యాటకులు చనిపోవడం బాధాకరమన్నారు. అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌కి పద్మశ్రీ అవార్డుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, సంస్థ డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, పార్వతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జలమండలి అప్రమత్తం
- అందుబాటులో ఉచిత నీటి ట్యాంకర్లు



ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

చంపాపేట: రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి.తాగునీటి వినియోగం కూడా పెరిగింది. వేసవిలో నీటి ఎద్దడి నివారణ, లోప్రెషర్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. తాగునీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేసి నీటి కాలుష్య నివారణకు జలమండలి సిబ్బంది నడుం బిగుస్తున్నారు. మురుకివాడలు, బస్తీలకు అవసరమైతే ట్యాకర్ల ద్వార తాగునీటిని అందించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. మే మాసంలో ఎండల తీవ్రత, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చంపాపేట, కర్మన్‌ఘాట్ ప్రాంత కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు ప్రారంభిస్తున్నారు. ప్రత్యేక చర్యల్లో భాగంగా మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, లీకేజీలు ఉన్న గేట్‌వాల్స్ స్థానంలో నూతన వాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

కలుషిత జలాల కట్టడికి చర్యలు..

చంపాపేట డివిజన్ పరిధిలోని శుభోదయ, నెహ్రూనగర్, హరిజన బస్తీ, లోతట్టు కాలనీలైన మల్‌రెడ్డి రంగారెడ్డినగర్, పద్మానగర్, ఉదయ్‌నగర్, రెడ్డి కాలనీ, కటకోనికుంట, దుర్గాభవానీనగర్ వంటి పలు కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ పక్కనే తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో గతంలో నిత్యం కలుషిత తాగునీరు సరఫరా అయ్యేది. కలుషిత జలాల నివారణ, లోప్రెజర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశలో గత మూడు నెలల క్రితమే ఆయా కాలనీల్లో నూతన పైప్‌లైన్‌లతో భూగర్భ డ్రైనేజీ విస్తరణ, కాలం చెల్లిన తాగునీటి పైప్‌లైన్ స్థానంలో నూతన లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆయా కాలనీల్లో కలుషిత నీటి సరఫరా సమస్య లేకున్నా ప్రస్తుతం కాలనీవాసుల నీటి వినియోగం పెరగటం, నీటి సరఫరా తగటంతో తాగునీటి ఎద్దడి కొంత మేరకు ఉందని అవసరమైతే నీటి ట్యాంకర్లపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

వేసవిలో సహజంగా నీటి వినియోగం రెట్టింపు స్థాయిలో ఉంటుంది. మే నెలలో ఇంకా అధికంగా ఉంటుంది. తాగునీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని అదనంగా కొన్ని నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంచాం. సాంకేతిక సమస్యలతో నీరు సరఫరా కాని ప్రాంతాలకు కాలనీవాసులకు అవసరాలకు తగ్గట్లుగా ట్యాంకర్ల ద్వార ఉచితంగా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. నోటిఫైడ్ మురికి వాడల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి సరిపోయేంత నీటిని ట్యాంకర్ల ద్వార సరఫరా చేస్తున్నాం. – రమ్యభారతి, వైశాలీనగర్ వాటర్‌వర్క్స్ మేనేజర్

దేశ సైనికులకు దైవ బలం ఉండాలి



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా

నాగోలు: మన దేశ సైనికులకు దైవ బలం ఉండాలని, ఎలాంటి మృత్యువు వారిని దరిచేరకుండా అన్ని రకాల విజయం వరించాలని ఆదివారం కొత్తపేట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సుదర్శన సహిత లక్ష్మీనరసింహస్వామి వారి మృత్యుంజయ హోమం నిర్వహించారు. గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, మొగుళ్లపల్లి యువసేన, కొత్తపేట ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమాలు, ఇతర పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, తెలంగాణ టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పబ్బ బాలయ్య, మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా, చింతల బాలరాజు, ఓరుగంటి వేణుమాధవ్, సూరిశెట్టి శ్రీనివాస్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకపోతుందని, ప్రధానీ మన్‌కీ బాత్ ప్రతి భారతీయుడి గుండె చప్పుడని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మల్లికార్జుననగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మన్‌కీ బాత్ వేదికగా ప్రధాని మోదీ ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో మార్పులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, మునగాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాజ్‌పేయి జీవితం నేటి నాయకులకు ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

సైదాబాద్: నైతిక విలువలతో కూడిన రాజకీయాలను సొంతం చేసుకున్న మహనీయుడు అటల్ బిహారి వాజ్‌పేయి అని బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ కొనియాడారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన విరాసత్ సమ్మేళనంలో లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. దేశానికి మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా పనిచేసే అవకాశం పొందిన వాజ్‌పేయి సమాజంలోని అట్టడుగు వారికి సైతం ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలని పరితపించేవారని అన్నారు. రాబోయే తరం రాజకీయ నాయకులకు ఆయన జీవితం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సహదేవ్ యాదవ్ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కమిటీలు వేస్తాం



ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కమిషన్‌ల ద్వారా వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కలిప్తుందని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆదివారం మలక్‌పేటలోని సంస్థ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వికలాంగుల సంఘాల నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి మండలానికి ఐదుగురు చొప్పున వికలాంగుల సంక్షేమ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.21, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.27, ఉల్లిగడ్డ రూ.18, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.45, మునగ రూ.26, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.19, కీర రూ.35, బీన్స్ రూ.75, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అన్నదానం

చంపాపేట: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ అన్నారు. ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడుగుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మవారి ఆలయం ముందు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌జీ మాట్లాడుతూ..ప్రతి అమావాస్య రోజు అన్న ప్రసాదాన్ని వితరణ చేయటం జరుగుతుందన్నారు. అనంతరం ట్రస్ట్ సభ్యుడు ఘనసాల వెంకటేష్ జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, ఘనసాల చింటు, రాజు, హరిలాల్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్క తరమడంతో వ్యక్తికి గాయాలు

యజమానిపై కేసు

సైదాబాద్: పెంపుడు కుక్క కారణంగా గాయాలకు గురయ్యానని బాధితుడికి ఫిర్యాదు మేరకు యజమానిపై కేసు నమోదైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జయానగర్ కాలనీలో నివసించే మహ్మద్ కమాల్ పాషా శనివారం సాయంత్రం తమ ఇంటి నుంచి నడుచుకుంటూ మసీద్‌కు బయల్దేరాడు. ఇంద్రప్రస్థ కాలనీ వద్ద పెంపుడు కుక్క తరమడంతో కిందపడి గాయాలయ్యాయి. గత మూడేళ్లుగా ఆ కుక్కతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, కుక్కను సంరక్షించుకోవాలని ఎన్నిసార్లు యజమాని సిమ్రాన్ ఠాకూర్‌కు చెప్పినా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిమ్రాన్ ఠాకూర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపార సముదాయాల
ఆదాయంతోనే దేవాలయాల నిర్వహణ



మాట్లాడుతున్న వివిధ దేవాలయాల ప్రతినిధులు

వనస్థలిపురం: పూర్వకాలంలో దేవాలయాల నిర్వహణకు రాజులు కొంత భూమిని కేటాయించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. దూప, దీప, నైవేద్యాలు, పూజారుల జీతాలు, ఇతర నిర్వహణల కోసం ఆలయ ప్రాంగణాల్లో లో దుకాణాలు, కల్యాణ మండపాన్ని నిర్మించి వాటిపై వచ్చే ఆదాయంతోనే దేవాలయాల నిర్వహణ కొనసాగుతుందని వనస్థలిపురం పరిధిలోని ఆయా దేవాలయాల ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'దేవాలయాలా.. వ్యాపార సముదాయాలా?' అనే కథనానికి ఆయా దేవాలయాల ప్రతినిధులు స్పందించారు. ఆదిఆరం వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరణ ఇచ్చారు. టీటీడీ, యాదగిరిగుట్ట తదితర దేవాలయాలలోనూ నిర్వహణ ఖర్చుల కోసం షాపులను నిర్మించారన్నారు. ఆలయాల ప్రాంగణంలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మడంతో ఎందరికో ఉపాధి దొరుకుతుందని దేవాలయాలో ఉచిత దర్శనంతో పాటు, ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కొందరు కావాలని ఆయా ఆలయాలపై దుష్ప్రచారం చేస్తున్నారని, భక్తులు, దాతలు ఎవరూ వచ్చినా వారికి లెక్కలు చూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, శ్రీ రామాలయం చైర్మన్ టి.లక్ష్మారావు, ఆలయాల ప్రతినిధులు డా.యు.ప్రభాకర్, కంచి కృష్ణమోహన్, మిట్టా రాంమోహన్, ఎల్.బాలేశ్వర్, వట్టం సురేష్, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం



నాలా పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: టన్నెలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీవాసులతో సమావేశం అయ్యారు. అనంతరం టన్నెల్ పనులను పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ సమయంలో ఎవరికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పనులు సాఫీగా జరిగేలా స్థానికులు అధికారులకు సహకారం అందించాలని కోరారు నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు అండగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హస్తినాపురం: వయోవృద్ధులకు అండగా ఉండాలని ఎల్‌బీనగర్ ఎస్సై సతీష్ అన్నారు.హస్తినాపురం డివిజన్ పరిధి నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఆదివారంవయోవద్దులను సక్రమంగా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. 70 సంత్సరాలకు పైబడి ఉన్న వారికి ఎవరూ చూసేవారు లేకపోతే తమ పోలీస్ యాప్‌లో వారి పేర్లు నమోదు చేసుకుంటే తాము వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగూరి చంద్రశేఖర్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు బీమిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వాటిని ప్రజలకు వివరించాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత అన్నారు. ఆదివారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమలో భాగంగా శ్రీ ఖిల్లా మైసమ్మ అమ్మవారి దేవాలయం నుంచి ర్యాలీగా వెళ్లి రాజ్యాంగ ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా గణేష్ నేత మాట్లాడుతూ.. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ అనే కార్యక్రమం, జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి మధుసూదన్ రావు, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత, శ్రీ ఖిలా మైసమ్మ అమ్మవారి దేవాలయం చైర్మన్ సురేంద్ర కుమార్, ధర్మకర్తలు బొడ్డుపల్లి మహేందర్, సందీప్, పెద్దపూర సైదులు, పగిళ్ల భూపాల్ రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న నర్సింహాగుప్తా

చైతన్యపురి: సాయినగర్ కాలనీ శివాజీ చౌక్‌లో దత్త సాయి సేవా సమితి, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో వేణుగోపాల్‌చారి ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిక పంపిణీ కార్యక్రమాన్ని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. తాగునీటితో పాటు మజ్జిగ సైతం పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ అధ్యక్షుడు లక్ష్మణాచారి, పరంధాములు, ఎల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు నవీన్‌యాదవ్, వినోద్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, అంజిబాయ్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

న్యూదిల్‌సుఖ్‌నగర్‌లో..

చైతన్యపురి: చలివేంద్రాల ఏర్పాటుకు వివిధ సంస్థలు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ అన్నారు. సిస్టంబోల్ట్ ఐటీ కన్సల్టెంట్ డైరెక్టర్ బత్తుల సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో న్యూదిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో ఎంతో మందికి దాహార్తిని తీర్చినట్లవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పర్లశివ, రామ్మోహన్, అంజిబాబు, వెంకటేష్, భానుప్రసాద్, రవి, అర్జున్‌సింగ్, భాస్కర్‌గౌడ్, అమూల్యారెడ్డి, భార్గవ్, చింటు, సందీప్ పాల్గొన్నారు.

పహల్గాం హత్యాకాండపై నిరసనలు

కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీల్లో కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కాలనీలవాసులు పాల్గొని ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. – ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నర్సింహారెడ్డి



ఆనందనగర్‌లో ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి





లలితానగర్ వెల్ఫేర్ అసోషియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ర్యాలీ నిర్వహిస్తున్న బృందావన్ మెడోస్ కాలనీవాసులు